క్లుప్తంగా

పీహెచ్‌సీ తనిఖీ

ముదిగొండ: వల్లభిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ రామారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి రికార్డులు, వ్యాక్సిన్ రూములను పరిశీలించారు. వైద్యాధికారి డాక్టర్ ధర్మేందర్‌తో సమస్యలు తెలుసుకున్నారు. ల్యాబ్‌లో అన్ని పరీక్షలు నిర్వహించాలని, ఫార్మసీలో మందులు అన్ని అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు.

ఎర్రవరంలో ఎమ్మెల్యే పూజలు


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్ దంపతులు

వైరా: సూర్యాపేట జిల్లా కోదాడ మండలం, ఎర్రవరం గ్రామంలోని బాల ఉగ్ర నరసింహాస్వామి ఆలయంలో మంగళవారం ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే దంపతులను సత్కరించి మెమెంటో అందజేశారు.

ఓపెన్ డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కల్లూరు: డాక్టర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ ప్రవేశానికి ఆగస్టు 13 వరకు గడువు ఉందని మధిర స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ డాక్టర్ శీలం ఇందిర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, పాలిటెక్నిక్, డిప్లమా, ఐటీఐ పాసయినవారు సంబంధిత సర్టిఫికెట్లతో దగ్గరలోని మీ సేవలో కానీ టీఎస్ ఆన్‌లైన్‌లో కాని 13 లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు 13 లోగా ట్యూషన్ ఫీజు చెల్లించాలని, తృతీయ సంవత్సరం 6వ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 20 నుంచి జరుగుతాయని తెలిపారు. పూర్తి వివరాలకు 7282929694 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పిచ్చికుక్క దాడిలో గాయాలు

ఏన్కూరు: మండలకేంద్రంలో పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏన్కూరు ప్రధాన వీధిలో మంగళవారం స్వైరవిహారం చేసిన కుక్క సుమారు పది మందిని గాయపరిచింది. దీంతో క్షతగాత్రులను పీహెచ్‌సీలో చికిత్స చేయించగా, కుక్కను గ్రామస్తులు తరుముతూ హతమార్చడతో జనం ఊపిరి పీల్చుకున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కులు అందజేస్తున్న నాయకులు

ఎర్రుపాలెం: మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో లబ్ధిదారులకు మంజూరైన రూ.4.98లక్షల రూపాయల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ మండలాధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తల్లపురెడ్డి నాగిరెడ్డి, అనుమోలు కృష్ణారావు, మల్లెల లక్ష్మణరావు, దేవరకొండ అనిల్‌కుమార్, షాబాష్, పసుపులేటి వెంకటనారాయణ, గుడేటి బాబురావు, రేఖా నాగరాజు, కోలకంటి వసంతరావు, చిన్న వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి


వినతిపత్రం అందజేస్తున్న ఉద్యమకారులు

బోనకల్: తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఉద్యమకారుల సంఘం జిల్లా కమిటీ అధ్యక్షుడు ఎస్‌కె.సర్దార్ హుస్సేన్ అన్నారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, సంక్షేమ పథకాల్లో వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు వాసు, కృష్ణ, వీరయ్య, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వన విలాపం..!


నీరు లేక ఎండిపోతున్న నారాయణపురం వనంలోని మొక్కలు

అలంకారప్రాయంగా పల్లెప్రకృతి వనాలు

- నీటి వసతి లేక ఎండిపోతున్న మొక్కలు
- సంచరిస్తున్న పశువులు.. వనాల్లో అసాంఘిక కార్యకలాపాలు
- పట్టించుకోని అధికారులు

మండలంలో పంచాయతీలు	27
పల్లె ప్రకృతి వనాలు	27
మొత్తం వ్యయం	రూ.1.3 కోట్లు
కూలీలకు చెల్లించినది	రూ.72,83,000
సామగ్రి ఖర్చు	రూ.63,62,000

తల్లాడ: పల్లెల్లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పల్లె ప్రకృతివనాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. అడవులు అంతరించి పోతుండటం, గ్రామాల్లో చెట్లు తరిగిపోతుండటంతో కాలుష్యం పెరిగి ప్రజలు సైతం కాలుష్యపు కోరల్లో చిక్కుకోకుండా ఉండేందుకే ప్రతీ గ్రామంలో ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశారు. తొలి ఏడాదిలో ఎంతో ఆహ్లాదాన్ని పంచిన ఈ వనాలు నేడు లక్ష్యానికి దూరంగా చేరి వెలవెల బోతున్నాయి. నీరు లేక చెట్లు ఎండిపోతున్నాయి. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో పల్లెవనాలపై పట్టింపే లేకుండా పోయింది.

మండలంలో రూ.1.3 కోట్ల వ్యయంతో..

మండలంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం నిధులతో 27 గ్రామాల్లో రూ.1.3 కోట్ల వ్యయంతో పల్లెప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. ప్రారంభంలో అధికారుల పర్యవేక్షణ బాగానే ఉన్నా రానురానూ పర్యవేక్షణ లోపించింది. దీనికి తోడు ప్రభుత్వం మారడంతో అసలు వనాలపై పట్టింపే లేకుండాపోయింది. దీంతో వనాల్లోని చెట్లు ఎండిపోయి, వడబడిపోతున్నాయి. తల్లాడ మేజర్ పంచాయతీలో అగ్ని ప్రమాదానికి గురై చెట్లు కాలిపోయాయి. మంగాపురంలో అయితే గేటుముందే కంప చెట్లు అడ్డంగా పెరిగాయి. నూతనకల్, మిట్టపల్లి, వెంగన్నపేట, బిల్లుపాడు, కొత్త వెంకటగిరి, నారాయణపురం, పినపాక, ముద్దునూరు, రంగంబంజర గ్రామాల్లోని పల్లె ప్రకృతి వనాలు వాటి రూపు రేఖలు కోల్పోతున్నాయి.


ఎండిపోతున్న చెట్లు

నిర్వహణ లేక..

పల్లెప్రకృతి వనాలకు కోట్లు ఖర్చుచేసిన ప్రభుత్వం వాటి నిర్వహణలో శ్రద్ధ పెట్టకపోవడంతో నేడు ఎండిపోయి మోడుబారిపోయాయి. దీంతో ఆ వనాల్లో పశువులు సంచరించడంతో పాటు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారాయి. గతంలో ఈ వనాలను కలెక్టర్ సందర్శించి ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగియడం, కార్యదర్శులకు పనిభారం పెరగడంతో వీటి గురించి పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం మెయింటినెన్స్ కూడా నిధులు వెచ్చించకపోవడంతో అవి రోజు రోజుకు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి.

నిధులు కేటాయించాలి..



పల్లె ప్రకృతి వనాలతో గ్రామాలకు ఎంతో ఉపయోగం ఉంది. పర్యావరణ పరిరక్షణకు ఇవి దోహదపడతాయి. పక్కాగా ప్రభుత్వ స్థలాల్లో ఏర్పాటు చేసిన ఈ పల్లె ప్రకృతి వనాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ప్రస్తుత ప్రభుత్వం వనాలపై శ్రద్ధ వహించి నిధులు కేటాయించాలి.
– శీలం కోటారెడ్డి, మాజీ సర్పంచ్, రామానుజవరం

నీరు సమకూరుస్తాం..



పల్లె ప్రకృతివనాలకు ప్రస్తుతం నిర్వహణ నిధులు లేక కొంత ఇబ్బందిగా ఉంది. ఏర్పాటు చేసిన వనాల్లో పూల మొక్కలు, చెట్లు బాగానే పెరిగాయి. బావులు, బోర్లలో నీరు అడుగంటడంతో పంచాయతీ ట్యాంకర్ల నీటి ద్వారా కాపాడేందుకు ప్రయత్నిస్తాం.
– సురేష్‌బాబు, ఎంపీడీఓ, తల్లాడ

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు


అధిక సాంద్రతతో సాగుచేసిన పత్తి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ విజయ్ చంద్ర

చింతకాని: పంటల సాగులో ఆధునిక పద్ధతులను అవలంభిస్తే అధిక దిగుబడులను సాధించవచ్చని మధిర ఏడీఏ విజయ్‌చంద్ర అన్నారు. మండలంలోని నాగిలిగొండ, నేరడ, లచ్చగూడెం గ్రామాల్లోని పత్తి, పెసర పంటలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అధిక సాంద్రత గల పత్తి వేయడంతో ఎకరానికి పత్తి మొక్కలు సుమారుగా 77 వేలు వస్తాయన్నారు. దీంతో ఎకరానికి రెండు, మూడు క్వింటాళ్ల అధిక దిగుబడిని పొందవచ్చన్నారు. అధిక సాంద్రత పత్తి సాగు విధానం, ఎరువుల నిర్వహణ, నీటి యాజమాన్యం, తెగుళ్ల నియంత్రణ గురించి రైతులకు అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతో అధిక లాభాలను పొందే పద్ధతులను అవలంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ డైరెక్టర్ కొప్పుల గోవిందరావు, మండల వ్యవసాయాధికారి మానస, వ్యవసాయ విస్తర్ణాధికారి రాము, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

రైతుల పెన్నిధిగా ‘భూ భారతి’


కల్లూరురూరల్: దరఖాస్తు అందజేస్తున్న రైతు

కల్లూరురూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం రైతులకు పెన్నిధిగా మారుతుందని రెవెన్యూ అధికారులు అన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని చండ్రుపట్లలో తహసీల్దార్ పులి సాంబశివుడు, తెలగవరం మర్లపాడు గ్రామాల్లో డిప్యూటీ తహశీల్దార్ బాబ్జి ప్రసాద్ భూ భారతి గ్రామసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా భూభారతి చట్టానికి సంబంధించి పలు విషయాలను రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కౌంటర్లలో దరఖాస్తులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఉమామహేశ్వరరావు, సుజాత, రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ముదిగొండ: మండలంలోని వెంకటాపురం గ్రామంలో భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటాపురంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు భూ భారతి రెవెన్యూ సదస్సులో తన దరఖాస్తును తహసీల్దార్ సునితఎల్జిబెత్‌కు అందజేశారు. ఇప్పటి వరకు మండలంలోని పలు గ్రామాల్లో మొత్తం 1,476 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ముందుకు తీసుకెళ్లాలి

ముదిగొండ: ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలనలో దేశాన్ని ప్రపంచంలోనే నాలుగో ఆర్థిక వ్యవస్థ దేశంగా తయారు చేశారని, ఆయన సంక్షేమ పథకాలు ముందుకు తీసుకెళ్లాలని బీజేపీ ప్రోగ్రాం ఇన్‌చార్జి ఆకుల నాగేశ్వరరావు గౌడ్ అన్నారు. ఈ మేరకు ముదిగొండలో మంగళవారం వికసిత్ భారత్, సేవా సుపరిపాలన పైన రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రేఖ సత్యనారాయణ, ఉన్నం వెంకయ్య, పాడకండ్ల శ్రీను, నాగరాజు, వినయ్, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


ఎర్రుపాలెం: మొక్కలు నాటుతున్న నాయకులు

మొక్కలు నాటిన నాయకులు

ఎర్రుపాలెం: ప్రధానిగా మోదీ 11 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీలో బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. దేవర కొండ కోటేశ్వరరావు, అనిత, కృపయ్య, వేల్పుల మోహన్‌రావు, వెంకయ్య, కోటయ్య, నాగేశ్వరరావు, బోసు, సుజాత, కందుకూరి కోటమ్మ, ఏసుమణి, రామయ్య, పుల్లయ్య, చిలకమ్మ, తదితరులున్నారు.

చిన్నారులను అంగన్‌వాడీలకు పంపించాలి


వైరా: సామూహిక అక్షరాభ్యాసం..

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని వెలుగు కార్యాలయం సమీపంలో ఉన్న అంగన్వాడీ–4 కేంద్రంలో అమ్మబాట అంగన్వాడీ బాట కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు సామూహిక అక్షారాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీ లక్ష్మీ, అంగన్వాడీ టీచర్ అన్నపూర్ణ తదితరులు ఉన్నారు.

సత్తుపల్లిటౌన్: అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా సత్తుపల్లిలో అంగన్‌వాడీ కేంద్రాల్లో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. మూడేళ్లు నిండిన చిన్నారులను అంగవాడీ కేంద్రాలకు తరలించాలని సీడీపీఓ మెహరున్నీసా కోరారు. విద్యార్థులకు ఎగ్‌బియ్యాని అందించారు. సూపర్‌వైజర్ గంగాజలం, టీచర్ ప్రమీల, సఖీనాబేగం, కృష్ణకుమారి, సౌభాగ్యవతి, గంగాభవాని, కో ఆర్డినేటర్ ప్రసాద్ పాల్గొన్నారు.

కల్లూరు: మున్సిపాలిటీ పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో కల్లూరు సెక్టార్ సూపర్‌వైజర్ సంధ్యారాణి సమక్షంలో కేంద్రంలోని పిల్లలకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు జహీదాబేగం, సఫియా బేగం, ఆయాలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

వైరా: ఇటీవల పీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కట్ల రంగారావు మంగళవారం హైదరాబాద్‌లో ఎంపీ రేణుకా చౌదరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమేరకు ఎంపీని ఆయన సన్మానించగా నాయకులు కాంపాటి శేషగిరి, కట్ల నాగరాజు, రేచర్ల రాముడు, కట్ల సంతోష్, సయ్యద్ అన్వర్ పాషా, గుత్తికొండ వీరబాబు, రేచర్ల పుల్లయ్య, పాణెం భాస్కర్, జి.రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్‌లో ఉత్తీర్ణత సాధించిన యువకుడికి..


నాగరాజును సన్మానిస్తున్న నాయకులు

కల్లూరురూరల్: సివిల్స్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వాచ్యనాయక్‌తండాకు బాణోత్ నాగరాజు నాయక్‌తో పాటు తల్లిదండ్రులు బాణోతు పంతులు, మారువిలను కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజా దేవి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దుర్గాప్రసాద్, భాగం ప్రభాకర్ చౌదరి, భూక్య శివ నాయక్, మూకర విజయరావు, బీరవెల్లి మాధవ్ తదితరులు ఉన్నారు.

మరమ్మతులు త్వరగా పూర్తిచేయాలి


పనులు పరిశీలించి సూచనలు చేస్తున్న పంచాయతీరాజ్ ఈఈ మహేష్

కారేపల్లి: మరమ్మతు పనులను నాణ్యతా ప్రమాణాలను పాటించి త్వరితగతిన పూర్తిచేయాలని పంచాయతీరాజ్ ఈఈ మహేష్ అన్నారు. ఈ మేరకు కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల మరమ్మతులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయకుమారి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఊరేగింపు

కారేపల్లి: కారేపల్లి శ్రీ పెద్దమ్మతల్లి అష్టమ వార్షికోత్సవం వేడుకల్లో భాగంగా మంగళవారం అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు ఊరేగింపు వేడుకను ఘనంగా నిర్వహించారు. శ్రీ పెద్దమ్మతల్లి తత్సంగం ఆధ్వర్యంలో మహిళలు కోలాట ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. అంతకుముందు ఆలయంలో వేదపండితులు మల్లికార్జునచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తురక నారాయణ, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పర్యవేక్షించారు.

‘రాజకీయ లబ్ధి కోసమే అవాస్తవ ప్రచారం’

కల్లూరు: రాష్ట్రంలో టీడీపీ మహాకూటమి బలపడుతుండడం చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు పార్టీపై దుష్ప్రచారానికి దిగారని టీడీపీ నాయకులు విమర్శించారు. మంగళవారం కల్లూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ జిల్లా నాయకులు జాస్తి శ్రీనివాసరావు, కాకర్ల రంగారావు, పోట్రు శ్రీనివాసరావులు మాట్లాడారు. సముద్రం పాలయ్యే గోదావరి జలాలతో పోలవరం నుంచి బనకచర్ల ప్రాజెక్ట్ నిర్మాణం చేపడుతుంటే బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు అడ్డుకోవడం వారి అజ్ఞానానికి నిదర్శనమన్నారు. నాయకులు కట్టా గోపాలరావు, దూబకుంట్ల మురళీకృష్ణ, బానోత్ చిట్టిబాబు, విజయదాసు, ఏడు కొండలు తదితరులు పాల్గొన్నారు.

రైతుభరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

ముదిగొండ: కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు రైతుభరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఓ సరిత అన్నారు. ఈ మేరకు ముదిగొండ రైతువేదికలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. పట్టాదారు పాస్ పుస్తకం డిజిటల్ సంతకం అయిన జిరాక్స్, ఆధార్‌కార్డు, బ్యాంకు బుక్ జిరాక్సులతో దరఖాస్తు నింపి సంబంధిత ఏఈఓలకు ఈ నెల 20 లోగా అందజేయాలని కోరారు

స్పోర్ట్స్ స్కూళ్లలో ఎంపికకు రేపు పోటీలు


మాట్లాడుతున్న ఎంఈఓ పుల్లయ్య

బోనకల్: జానకిపురం గ్రామంలోని పాఠశాలలో గురువారం మండలస్థాయి స్పోర్ట్స్ స్కూల్స్‌కు విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు ఎంఈఓ డి.పుల్లయ్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం మండలకేంద్రంలోని ఎంఆర్సీ కేంద్రంలో నిర్వహించిన పీఈటీల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులు ఎంపిక కార్యక్రమానికి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు


ట్రాన్స్‌ఫార్మర్ వద్ద అధికారులు

ఎర్రుపాలెం: మండలంలోని మీనవోలు గ్రామంలో మంగళవారం 25 కేవీఏ నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ అధికారులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ ఏఈ జి.అనూష మాట్లాడుతూ... గ్రామంలోని వినియోగదారులకు లో వోల్టేజి సమస్య లేకుండా క్వాలిటీ విద్యుత్ సరఫరా చేసేందుకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో లైన్‌మేన్ వెంకటేశ్వర్లు, నాయకులు పిల్లి బోసు, షేక్ జానీబాషా, ఫారుక్, రాము, అనిల్, పుల్లయ్య, యాగయ్య, వేణు, రాము తదితరులు ఉన్నారు.

మండల అధ్యక్షుడిగా శ్రీనివాసరాజు

తల్లాడ: టీడీపీ తల్లాడ మండల అధ్యక్షుడిగా సరికొండ శ్రీనివాసరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం తల్లాడ మండల టీడీపీ కమిటీ ఎన్నికను సత్తుపల్లి నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ కేతినేని హరీష్ ప్రకటించారు. గ్రామ కమిటీ ఆమోదం మేరకు కమిటీని ఎన్నిక చేసినట్టు తెలిపారు. పార్టీ ఉపాధ్యక్షులుగా రావూరి రవిప్రసాద్, మూకర దోనేష్, కార్యదర్శిగా వడ్డీల నాగేశ్వరరావును ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

వృథాగా తాగునీరు..

కల్లూరురూరల్: మండలంలోని మర్లపాడు క్రాస్‌రోడ్‌లో ఓహెచ్‌ఎస్ఆర్ వాల్ లీకై కొన్ని రోజులుగా తాగునీరు రోడ్డు వెంబడి ప్రవహిస్తోంది. మెయిన్‌పైపులతో నీరు లీకై వృథాగా పోతుండటంతో గ్రామాలకు తాగునీరు అందని పరిస్థితి నెలకొంది. తక్షణమే మిషన్ భగీరథ అధికారులు మర్లపాడు క్రాస్‌రోడ్డు వద్ద వాల్ లీక్ జరగకుండా మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ బడులు


సత్తుపల్లిరూరల్: స్కూల్ బ్యాగులతో విద్యార్థులు, తదితరులు

మధిర: దెండుకూరు హరిజనవాడ పాఠశాల విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ ప్లానింగ్ అధికారి సిహెచ్ రామకృష్ణ, ఎంఈఓ ప్రభాకర్ చేతులమీదుగా మంగళవారం రూ.15 వేలు విలువ చేసే నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. దాతల సహకారంతో నోటు పుస్తకాలు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్యామలరావు, సునీత, నాగరాజు, శాంతమ్మ, మహమ్మద్, నాగేంద్రబాబు, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లి: కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల నిర్వాహణ ఉంటుందని, పిల్లల తల్లిదండ్రులు సర్కారు బడుల్లోనే చేర్పించాలని ఎంఈఓ దుగ్గిరాల జయరాజు అన్నారు. ఈ మేరకు మండలకేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో మండలంలోని ఆయా పాఠశాలలకు ఉచిత నోటు పుస్తకాలను ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని సౌకర్యాలతో పాటు, అర్హులైన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్యాబోధన జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎస్ మోతిలాల్, స్ట్రాంగ్ టీచర్ ఎల్ లక్ష్మణ్, శ్యాంలాల్, హెచ్‌ఎంలు రమేష్, వీరూనాయక్, మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లిటౌన్: మండలంలోని 51 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలతో పాటు ఉన్నత పాఠశాలల విద్యార్థులకు నోట్‌పుస్తకాలను పంపిణీ చేశారు. వీటిని మండల వనరుల కేంద్రం నుంచి ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నక్కా రాజేశ్వరరావు, ఉపాధ్యాయులు, మధుసూదనచారి పాల్గొన్నారు.

బ్యాగ్‌ల పంపిణీ

సత్తుపల్లిరూరల్: మండల పరిధిలోని కొమ్ముగూడెం మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు సత్తుపల్లి సుధా హెర్బల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్, సనాతన ఆయుర్వేద వైద్యురాలు కొనకళ్ల సుధారాణి స్కూల్ బ్యాగ్‌లను వితరణగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రాజేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం ఎస్.మధు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మధిర: నోట్ పుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ


సత్తుపల్లిటౌన్: నోట్ పుస్తకాల అందజేత..


కారేపల్లిలో..